


కిలకిల మంటూ క్లాసులు విడిచి పిల్లలు తొందర తొందరగా మధ్యాహ్నం భోజనాలుచేసే షెడ్డుకి వెళ్తున్నారు.

బరువుగా అడుగులేస్తూ వెళ్తూన్న రాజుభుజంమీద వెనకనించి నారాయణ చెయ్యి వేశాడో లేదో రాజు విదిలించు కొని షెడ్డులోకి పరుగెత్తాడు...

నారాయణ రోజూలాగే రాజు ప్రక్క కెళ్ళి కూర్చుని తన అన్నం మూట విప్పుతున్నాడు. "ఫో! నా పక్కన కూర్చోకు!" అంటూ రాజు చురచుర చూశాడు. నారాయణ విస్తుపోయాడు...

తింటున్నది తినకుండానే రాజు లేచి పోతూంటే నారాయణ పట్టుకున్నాడు. రాజు తప్పించుకొని దూరంగా పోయి కోపంగా "నన్ను ముట్టుకోకు!" అని

అరిచాడు, నారాయణ చేతులు ముడుచు కొని వెనక్కు జరిగి కర్రగట్టిపోయాడు... 'రాజుకి తనతో స్నేహం మొదలైనప్పుడే తెలుసు —' తనే చెప్పుకున్నాడు —, రాజు అదేమీ పట్టించుకోలేదు. ఇంకా — ఎన్నోసార్లు పక్కపక్కనే రాసుక్కూచుని భోజనాలు చేస్తున్నప్పుడు రాజు తన చేయి పట్టుకొని అతని కూరా అవీ బల వంతంగా తీయింపించి తినిపించేవాడు; అలాగే తనవీ లాక్కుని — 'చాలా రుచిగా ఉందే నారాయ్!' అనే రాజు — వాళ్ళింటికి తీసుకెళ్ళి చెల్లెలూ వాడూ తనతో ఇల్లంతా తిప్పుతూ ఆడుకొనే తన రాజు — ఇవ్వాళ ఎందుకిలాగ అంటున్నాడు????!... నారాయణ ముఖం చెమటపట్టేసింది — కాళ్ళు వొణుకుతున్నాయి...

రాజు చల్లబడిపోయాడు చూసి — నారాయణ దగ్గరగా జరిగి భుజం మీద చెయ్యేసి, "ఒరే నారాయ్! నీమీద నాకేం కోపం లేదురా!...కాని మనం జట్టు విప్పేసుకుందాం...మీ రే — నువ్వు కాదులే — మీవాళ్ళంతా అన్నీ పాడుపనులే చేస్తారు — పాపం పనులే!!...మా 'సింగి'ని — నీకూ తెలుసుగా — మేం పెంచుకొంటున్న సింగి కుక్కని...' మరి చెప్పలేకపోయాడు రాజు.

"ఏం — ఏంటయిందిరా??...మీ సింగి నాకెందుకు తెలీదూ! దానికి నాలుగు పిల్లలు — అందులో నిలువు బొట్టు కలవ తోక పిల్లని నాకిచ్చేస్తానన్నావు — తప్పేవు సుమీ!..." నారాయణ అంటూంటే,

"నాలుగింటినీ తీసుకుపో — మీ నాయన కప్పజెప్పుకుంటావో — మరేం జేసుకుంటావో — వాటికి తల్లిపాలు మరిక లేవు — మీ అయ్య సింగిని పట్టేసి, కుక్కల్ని చంపేయడానికి తీసుకుపోతారే ఆ వేన్‌లో పడేశాడు"...అంటూ రాజు ఒక్కసారి పెల్లుబికిన దుఃఖంతో బావురు మన్నాడు. నారాయణ గతుక్కుమన్నాడు: బెక్కుతూనే రాజు చెప్పుకుపోతున్నాడు.. "మా చెల్లెమ్మా నేనూ పరుగెత్తుకొచ్చాం. కుక్కపిల్లలు నాలుగూ బండికేసి చూస్తు న్నాయి. చెల్లి ఏడుస్తోంది, నేను "మా సింగిని ఒదిలెయ్యండి! డబ్బు లిస్తాం! లైసెన్సు బిళ్ళ కట్టుతాం!" అని అరుస్తూ బండి వెనకాల చాలా దూరం పరిగెట్టాను.. ఆ బండి ఆగలేదు...!" రాజు గొంతు ఠక్కున ఆగిపోయింది, నారాయణ మతి పోయింది.

*　　*　　*

క్లాసులో నారాయణ తల తిరుగు తోంది — తండ్రి చేసేపని, సింగి — దాని ముద్దొచ్చే పిల్లలు, ఎన్నో కుక్కలు... సింగిని అయ్య పట్టేశాడు!...రోజూ ఎన్నో కుక్కల్ని సంపెయ్యడానికి పడుతూంటాడు — వాటి పిల్లలకి పాలుండవు, అవి కుంయ్యో — కుంయ్యో

అంటున్నాయి...బండిలో కుక్కలు మూల్గుతున్నాయి, గింజుకుంటున్నాయి-వాటిని పాపం చంపేస్తారు...నారాయణ తల గిరగిరలాడుతోంటే మాష్టారు చెబుతున్న బుద్ధుణ్ణి గురించిన పాఠం వినిపిస్తోంది... 'జీవహింస చేయరాదు — ప్రాణులను చంపుట పాపము...నోరులేని జంతువుల యెడ దయకలిగి యుండవలెను...'

"ఒరే! నారాయణా! ఏఁవిటలాగ-? వింటున్నావా, ఒంటిమీద తెలివుందా లేదా? నిల్చో!'' అంటూ మాష్టారు వేసిన కేకకి ఉలిక్కిపడి నిల్చున్నాడు.

''నేనేమిటి చెప్తున్నానో చెప్పు!'' మాష్టారు గద్దించాడు.

నారాయణ బెక్కుతూ...''మరే... బుద్ధుడు కుక్కల్ని చంపకూడదని....'' ఇంకా ఏదో తడబడుతూ అనబోతూంటే క్లాసంతా గొల్లుమంది నవ్వుల్తో కేరింతాలతో.

"ఒక్క కుక్కల్నే ఏఁవిట్రా?! ఏ జీవుల్నీ...'' అని మాష్టారేదో అంటూండగా, "అదికాదండీ మాష్టారూ! వాడి నాన్న — కుక్కల భీముడు! — కుక్కల్ని పట్టేవాడు సార్!'' అంటూ ఎవడో కుర్రాడు గట్టిగా అరిచేసరికి మరొకసారి క్లాసంతా ఘొల్లు ఘొల్లుమంది.

ఆ అరిచింది రాజు కాడు — రాజు తల వొంచుకొనే కూర్చుని కనిపించాడు నారాయణకి.

* * *

నారాయణ పుస్తకాలు అవీ ఇంట్లోకి గిరాటేసి గడపమీఁద రాటనానుకొని కూలబడిపోయాడు. బావినుంచొస్తున్న



లచ్చిమికి కొడుకువాలకం కంగారెత్తించింది. ఇంట్లోకెళ్ళి, "అలబొద్దు తినవుర్రా అబ్బీ!?" అంటూ కేకేసింది.

"తిననే! తిన్ను..." అన్నాడు కోపంగా నారాయణ.

"ఎంట్రా నారిగా! ఎందు కలక? మేట్టరు కొట్టిండా?"

"ఆళ్లేం మనలాంటోళ్ళను కున్నావా? ఊరికే కొట్టడానికీ—సంపడానికీ......"

"మరేందిరా యీగొడవ? అలక మానేసి తిన్నూఓరబ్బి!"

"ఓలమ్మా! తిన్నంటే తిన్ను. ఇప్పిదేగాదు నేనీ పాడుఇంట్లో ఏప్పుడూ యీ పాపంకూడు అసలు తిన్నేతిన్ను!" అనేసి నారాయణ అరుగుమీదే పడుకుండి పోయాడు. ఆరాత్రికూడా నారాయణ కూడు తిన్లేదు. లచ్చిమిచూసింది, వాడి ఒళ్ళు వెచ్చగాకాల్తోంది.

"మరే!—మాఁవోయ్! నారిగాడికి జొరం ఒచ్చినాది. ఈడకొచ్చి బుల్లోణ్ణి సూస్తాఉండు, నీకూ్కడొడ్డించొస్తా!" అంటూ పాకవతల మంచంమీద ఏదో సినిమాదేన్నో పాట ఊలగొడుతూ బాణాకర్రమీద చిటికెవేస్తూన్న భీముడిని కేకేసింది లచ్చిమి.

ఇంటి ముంజూర్లోదూరి—అరుగుమీద కొడుకుపక్క చదికిలబడి వాడి ఒంటిమీద చెయ్యేశాడు భీఁవుడు; నారాయణ గతుక్కుమనికళ్ళిప్పిచూశాడు. ఆమసక చీకట్లో వాడికి భీఁవుడిముఖం తండ్రి ముఖంలాగ కనిపించలేదు—, "నన్నొట్టుకు పోడానికొచ్చావా? నీ కర్రేది? నీతాడేదీ? పీక్కు రేసి కర్రతోబాది పట్టి లాక్కు పోతావు గదూ నువ్వు! లాక్కుపో! యములోడివి గదూ నువ్వు!..." అంటూ నారాయణ అంటూంటే భీఁవుడిగుండెలు గుభేలుమన్నాయి.

"నేనురోయ్ అబ్బి! నాయన్నిరా, నీ అయ్యనిరా! సరిగ్గాసూడురా బుల్లోడా! నారిగా సరీగ్గా చూడరా తండ్రీ! భీఁవుణ్ణిరా!..."

నారాయణ తేరుకున్నాడు. తండ్రిని తేరిచూస్తూ—"ఔను!—అయ్యవే! భీఁవుడివి—కుక్కలభీము డంటారు కదూ? కుక్కలమీద యమదూతలాంటోడివనే—కుక్కలయముడు అనీ..." అంటూ నారాయణ అంటూంటే భీముడికి ఒళ్ళుతెలీని కోపంవచ్చేసి కొడుకు చెంపమీద ఫెడీమని గట్టిగా చరిచాడు. లచ్చిమి ఒక్కదూకున ఇట్లోంచి వచ్చింది. నారాయణ కళ్ళంట నీరుకారుస్తూనే ప్రాధేయంగా భీముడినిచూస్తూ, "అయ్యా! నోర్లేని ఆ కుక్కల్ని సంపకు—పాపం! పెద్దపాపం! బుద్ధు దేవన్నాడో తెల్సా! జీవహింస చేయరాదన్నాడయ్యా! పాడుపని మానేసెయ్యి!—మానేస్తావు గదూ??... లేకపోతే పాపంకూడు తిన్ను—నే నీ యింటికాడే ఉండను—యములోళ్ళింటికి పోతా!..." అని



''ఇదుగో అబ్బాయ్! మీ అమ్మ సినిమాకు వెళ్ళింది. మీ నాన్న క్లబ్‌కు పోయాడు. యిప్పుడు అల్లరి చేశావంటే కాళ్ళు విరగగొడతాను."

అంటూంటే భీముడు పిత పితలాడి పోయాడు. లచ్చిమి కొరకొరాచూస్తూ, "సాల్లే! ఎల్లు – లోనకెల్లు – కూడు ఉనిపో;–జొరంతో పిల్లోడుంటే సెయ్యి చేసుకున్నావు!." భీముడు పెళ్ళాంవంక ఎఱ్ఱగా గుడ్లురిమిచూస్తూ లోపలికెళ్తూంటే లచ్చిమి మళ్ళా అందుకుంది, "అంత కంటే నీ కేండెలు స్తదిలే – కటికబత్కుకి జాలీ, ప్రేమా?!'' అనంటూంటే భీముడు బుసకొట్టాడు పుట్టలోంచి పాము లాగా ఇంట్లో.

లచ్చిమి నారాయణతల ఒళ్ళోపెట్టు కొని మనసులో అమ్మోరిని మొక్కింది. "అమ్మా!'' తల్లి కళ్ళల్లోకి చూస్తూ నారాయణ పిల్చాడు. "నాయన్ని ఆ పాడుపని మానేయమని – సెప్తావుగదూ! సెప్పు – మానిపించు...'' అన్నాడు.

''అయ్య పనిమానేస్తే – మరి మనకి కూడో?'' అంది లచ్చిమి.

''మన కూడొస్తాదని ఆటినెందుకే సంపడం? పాడుపనే మనం జేయాలా? మంచిపని మరొకటిలేదా? కూడు లేక పోతే సద్దాం! అంతే...!...అరుగో –

ఆఖ్ఖా మనలాంటోళ్ళే – యెం పుడి దూతలు...!!!''

లచ్చిమి గాభరాపడి పోయింది – అబ్బిని కాపాడమని వెంకటేసుడికి మొక్కుంది. దురగమ్మ తల్లికి అమాస నాడు మూడు కోడిపుంజులు కోస్తానని మొక్కుకొంది. నారాయణకి మగతగా కునుకుపట్టింది.

*　　*　　*

భీముడికి కూడు సయించ లేదు. ఆరుబయటి మంచంలో జేరబడ్డాడు... కునుకు రాలేదు...కుక్క అరుపులూ నక్కఅరుపులూ కలిసి వినిపిస్తున్నాయి.. ఒక్కసారి నిశ్శబ్దం అయింది ;...'పాడు పని ! పాపం !!' నారాయణ మాటలు సెవ్వుల్లో గింగురుమన్నాయి – కళ్ళిప్పి చూశాడు – ఆకాశం తేటగా ఉంది – చుక్కలు మెరుస్తున్నాయి...అబ్బిగాడి నోటంట అలాంటి మాటలెలా గొచ్చాయి – ? సదివిస్తే యిదే సిక్కు !.. ఈ పెపంచంలో మంచిపనీ సెడ్డపనీ ఉన్నాయా ? కూడుకోసం ఎదో ఒక పాడు – పాటు. కుక్కల్ని సంపితే పాపంవా ? సంపడానికే పట్టుగోవడం పాడు పనా ? మరి గొర్రెల్ని కోళ్ళని సంపెయ్యలేదూ ? తినేస్తే పుణ్ణెవూంనా ?! పాపం పుణ్ణెం ఏలదంతా ! ఇంత జీతం యిస్తున్నారు – దబ్బొస్తున్నది...ఇంత కంటే తక్కువ గిట్టినాం సిన్న జీతమైనా సేసేస్తున్నారు కానామంది పన్లు ! – అవి మంచిపన్లా యేటి ? కొంచెం మంచి జీతమే యిస్తుంటే ఇది పాడు పని ఎట్టా గొద్ది ?? ఏదో మూడు కడుపులకీ ఇంత – సిక్కటి గెంజో పల్చటి కూడో – లేదనకుండా – తక్కిన మా వోళ్ళలాగ బజార్లంట, పొలాల్లంట, తోటల్లంట దేవురించి తిరక్కుండా...మరి నారిగాడేం వలా వాపోస్తాడు ?!...కోటి ఇద్దెలూ కూటి కోసంవేగద ! ఛా ! మత్తు బిళ్ళ వేస్తే తినేసే తెలివీ తేటా లేని ముండా కుక్కల్ని – నోర్లేని యెదవ జీవాల్ని దిక్కులేని మూగి కుక్కల్ని ఎనకాల్నించి తీగె జారుముడేసి వలేసి పట్టుకొని సావ బాదడం, ఇదీ ఒక ఇద్దేనా ? కాః – ఇదేం ఇద్దె ?......

ఆకాశంలో నల్లనల్లగా తెల్లతెల్లగా మబ్బులు కమ్ముతున్నాయి. పెద్ద పెద్ద సిన్నసిన్న కుక్కల్లాగే కనిపించాయా మబ్బులు భీముడికి...

...ఇదీ ఇద్దేను. ఎంతెంత కుక్కలు – కోరలు పులిసి బలిసిన పొగరుబోతు కుక్కలు – ఎంత సులువుగా పట్టేస్తాను – జబ్బ సత్తువుంది గనక – ఏదీ మరో డెవడన్నా పట్టమను సూత్తా !...భీముడు వాడి కండలు తిరిగిన భుజాల్ని ఒకసారి గర్వంగా తడుంకొన్నాడు – నూగు మీసం నులిపాడు...యెముడు తనలాగే పాశెం ఏసి పేణుల్ని లాక్కుపోతాడుంట –

అందుకే ఆడంటే అందరికీ అంతమంట ! ఆడు చేసేది మంచిదే! అలా జేయక పోతే యీ బూమ్మీద మనుసులు లావై పోరూ? మరీ లావైపోయి తిండిదొరక్క మనుసులు మనుసుల్నే సంపేసుకొని తినేయరూ మరి! అందుకే ఆ మహాను బావుణ్ణి యమధర్మరాజన్నారు. ధరమఁవే సేస్తాడన్నమాట! నే జేసేదీ ధరమఁవే మరి. కుక్కల్నిపట్టి సంపెయ్యకపోతే పట్నవంతా కుక్కల్తోనిండిపోదూ; ఆ యెఁవుడు జేసేపనే నేజేస్తుంటాను, ఆడి దూతలూ అంతేగా! అందుకే — కొంద రెదవలు నా యనక — కుక్కయముడు — యఁవదూత అంటూ కూస్తారు. కూసు కోనీ, నాకేం?!...కుక్కలవల్ల ఎంతెంత గోరప్రమాదాలో తెలిస్తేనా! ఎఱ్ఱికుక్కల్ని పిచ్చికుక్కల్ని, కాట్లకుక్కల్ని ఆ యెముడు సంపడు — అంచేత మనఁవే సంపెయ్యాలి. ఏ కుక్కలు ఎఱ్ఱెత్తుతాయోఁ మనకేం దెలుస్తది? అందుకని అన్ని కుక్కల్నీ — పాపం! మంచికుక్కల్నీ పట్టి సంపేస్తున్నాఁ! ఈ కుక్కలవల్ల మనుసులికి ఎంత ప్రెమాదమో బుల్లోడి కేం దెలుసు? ఒక్క రోజునే ఎఱ్ఱికుక్క కరిసి నలుగురు పిల్లోళ్ళు — పాపం ఆళ్ళమ్మలు అయ్యలు ఎంతేడిశారో — ఒక్క ఎఱ్ఱికుక్క మరి పదికుక్కల్ని కాట్లేసింది — అవీ ఎఱ్ఱెత్తి ఊరందర్నీ కరిసేసి ఆస్పత్రిని హడలగొట్టించేయలా? రాత్రిళ్ళు ఎంతెంత అల్లరీ! యీటివల్ల మనుసులకి పెపంచానికి ఎంత ప్రెమాదమో నారిగాడికేం దెలుసు, ఆడి కెలాగ నచ్చజెప్పడం?......అసలు సంపించేది నేనుకాదే...ఎన్నాళ్ళనుంచో ఉన్నాదే...నేను కాకపోతే ఇంకొక డెవడన్నా జేస్తాడీపని — ఔను! ఇంకోడు జేస్తాడు! నేనెందుకు మానేయకూడదూ? బుల్లోడికంత యిష్టంలేనిపని!?...మానేస్తే ఆ ఇంకొకడూ మరెవడుగనక — నాలాం టోడే—! పెద్దలెన్నోమాటలు జెపుతారు, యిలాంటిపన్లు మా నెత్తినే ఎందుకు పులుముతారు? సిన్న సిన్న జీతాలైనా, కడుపులుమాడినా పై జాతులోళ్ళు మరే పన్లో జేస్తారేకాని — మేంజేసే పనులు జేయడానికి రారేం!...అయితే...అబ్బిగా డన్నట్లు ఇది పాడుపనే అయ్యుండాల! పాడుపనే — పాపం ఏదో ఒకకుక్క ఎఱ్ఱెత్తి ఎవర్నో కరిసిందని—అన్నింటినీ— ఆనోర్లేని దిక్కుమాలిన కుక్కల్ని — ఇషంగాలొాదిలిఁ పొగలెట్టి సంపడం, కఱ్ఱల్తోబాది, ఉర్లేసి, మందెట్టి పట్టుగోడం పాపఁవేనేమో :......

ఆకాశంలో మబ్బులన్నీ భీముడికి వాడు పట్టిన కుక్కలన్నీ పగబట్టి మీద పడబోతున్నట్టు కనిపించాయి. మబ్బుల చాటుల్లోంచి చుక్కలు వాటికళ్ళల్లో మెరిసే నీటిబొట్టుల్లా కనిపించాయి...కుక్కలు గింజుకుంటున్నాయి — సొంగలు కారుస్తు

న్నాయి – మూలుగుతున్నాయి – ఆకాశం నిండా కమ్ముకొస్తున్నాయి......

'...అవీ మనలాంటి పేణా లున్నాయే – బతుకంటే ఆటికీ తీపే! ఆటికి నోరేలేదు! – మనుసుల్లాగ – నేరాలు చేసి చెయ్యలేదని వాదించుకోడానికి...పాడుపనులు జేస్తూ మహా మంచిపన్లే జేస్తున్నా(మని డబ్బీలు గొట్టుకోడానికి – ఆటికి నోరే లేదు! అందుకే ఆట్ని సంపేస్తున్నాం. ప్రెమాదమని! – మరి యీ మనుసులు ఆటికంటే ఎక్కువ ప్రెమాదాలే చేస్తున్నారే! కుక్కలకంటె అద్దోన్నంగా కాట్లాడుతారే – ఒకర్నొకరు దొంగకాటేసుకుంటున్నారే. ఒకడిలోఉన్న ఇసాన్ని మరొకడికి ఎక్కిస్తున్నారే!!!...ఒక్కంటే ఒక్కొక్క మనిషేకాదు – పెద్ద రాజ్యేలు – దేశేలు ఏలేవోళ్ళే కోరల్లాగ మందుగుళ్ళు పిరంగీలూ,బాంబూలు పెంచుకొని కోరలు పులిసిన కుక్కలాగ పొరుగు వాళ్ళని కాటేస్తున్నారే! – మరి ఆ సీనావోళ్ళు ఇంతేగద!...

ఉత్తర దిక్కున ఆకాశంలోకి పెద్ద కారుమేఘం ఉవ్వెత్తుగా లేచింది. అదొక వెఱ్ఱెత్తిన రాకాసి కుక్క ఆకారంతో భయంకరంగా దూకుతున్నట్లుగా కనిపించింది భీముడికి.

...మరి ఇలాంటి ఎఱ్ఱి కుక్కల్ని వట్టుకొని ఆటివల్ల ప్రెపంచానికి కీడు రాకుండా అరికట్టే వోళ్ళు ఎవురు! – ఎఱ్ఱికుక్క వల్ల మనుషులకి ప్రెమాదం లేకుండా దాన్ని పట్టుగొని పనిపట్టించే పూచీ ఎవరిది?

మందే! మన(వే సెయ్యాలా పని – మన(వంటే యీ పెపంచకంలోని మనుస్యు లందరిదీను –!

ఎఱ్ఱి కుక్కల్ని ఆ యముడు సంపలేడు – మన(వే మన మనుసుల మేలు కోసం ఆటి పని పట్టించుతాం!

వరదొచ్చినప్పుడు ఎఱ్ఱ బురద నీరు తాగి కుక్కలు పిచ్చెత్తుతయ్యంటారు – మరీళ్ళు నెత్తురు తాగి ఎఱ్ఱెత్తి పోతారు గాబోలు!

ఏం తిండిదొరక్క కణకణా కడుపులు మాడితే కుక్కలు జెఱ్రుల్నీ కప్పల్నీ.ఇసజెంతువుల్నీ యింకా తినరానివన్నీ తినేసి – ఇషంపట్టిపోయి కోరలు పులిసి కాట్లు మొదలెడతాయట –! మరీళ్ళో? తోటి మనుసుల్ని గొట్టి పీనిగెల్దిని క్కై పెక్కిపోనారు కాబోలు!.."

మనుసులే మడుసులై ఎఱ్ఱి కుక్కలుగామారి మనుసులమీదా, రాజ్యేనికి రాజ్జెమే ఎఱ్ఱెత్తి ఎగబడుతూంటే – పాపం దిక్కుమాల్ని కుక్కల్నెందుకు జంపడం? ఇదేం గొప్ప...

బారతం కతలో జెప్పుతారే – ఆ దుచ్చాసనుడి పనిబట్టిన భీముడు!... ఆ భీముడులాగ బతకాలి! తలుసుకుంటే



అంతటోణ్ణి కాలేనా ఏటి ? !. — భీముడు ఒకసారి ఛాతీని భుజాల్నీ చరుచుకున్నాడు—"భీముడు...నే ! భీఁవుణ్ణే.." అని అనుకుంటూంటే భళ్ళున తెల్లారింది. తక్కునలేచి ఇంటి ముంజూర్లో కెళ్ళి కొడుకుని చూసుకొన్నాడు, ఒళ్ళు చల్లబడింది, సుఖంగా నిద్రపోతున్నాడు.

లోపలేదో కొత్తసంతోషం ఉరకలేస్తుంటే భీముడు నీళ్ళుపోసుకోడానికి పోయాడు.

* * *

నీళ్ళోసుకొచ్చిన భీముడికెదురుగా నల్లటినిక్కరు, ఎఱ్ఱగీరల బనీను పట్టుకొని లచ్చిమి అందివ్వబోతే, భీముడు వాటిని చూడనట్లే వెళ్ళి పెట్టితీసి వేరే తెల్లటిబట్టలు వేసుకున్నాడు. ఏవో కాగితాలూ ఏదోతీసి జేబులో పెట్టుకుంటూంటే, "పన్లోకెల్లవా ఇయ్యాల ?" అంటూ లచ్చిమి ఆశ్చర్యంగా చూసింది. "ఎల్తా నెల్తాను ! శాన్నాళ్ళనుంచే అనుకుంటున్నాన్లే... మా తాత పటాలంలో సంపాదించిన పతకం మనింటనే ఉంది—! సిపాయిల్లో సిపాయి అనిపించుకొన్న — పల్నాటిబాలసెందురుడులోంటి-వీరడు - మా అమ్మ తమ్ముడే ! నేను మా త్తరం తక్కువోణ్ణా !''అంటూ వెళ్లి నారాయణ తల నిమురుతూ, "మానేస్తున్నానురా అబ్బి! నువ్వొద్దన్నపని" అన్నాడు. నారాయణ విచిత్రగా తండ్రికేసి చూశాడు. "నిజవేఁనా అబ్బి ! దిక్కుమాల్న కుక్కల జోలికింకబోను." అంటూ కూర్చున్నవాడు అమాంతంగా లేచి నిలబడ్డాడు భీముడు.

''మన పొలిమేర పెద్ద ఎఱ్ఱికుక్క కాసుకొని ఉంది ! దాని పని పట్టించాలి ! ఆ కుక్క ఎనకాలా ముందరా ఎఱ్ఱి కుక్కల్ని మందలు మందలు పెట్టుకొని దూకబోతా ఉంది; అది మాటలు నేర్చి మాటలు మార్చే కుక్క - గొంతులు మార్చి అరిచే టక్కులమారి కుక్క. అది మన జోలికిరాకుండా, దానివల్ల మనకి పెమాదం లేకుండా మనం జాగ్రత్తపడాలి! అలాగ జాగ్రత్తలో ఉండే పన్లున్నాయి. ఆ పనికే నే నెల్తున్నా !-" అంటూ భీముడు చేయెత్తి పిడికిలిబిగించి 'నేను భీఁవుడినే! భీముడిని!' అనుకొంటూ ముందుకు అడుగువేశాడు ఇంటినుంచి - ఉదయించిన సూర్యుడికి ఎదురుగా. ★

---

## సినిమా క్విజ్ - జవాబులు

1. మురిపించే మువ్వలు, 2. చిట్టి తమ్ముడు.